
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
ఆదివారం 3 నవంబరు 2024



డైట్, కాస్మోటిక్స్ ఛార్జీల పెంపుపై సంబరాలు

గొల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడం వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు మేలు జరుగుతుందని డీసీవో పెగడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ చెరుకు సుష్మిత పేర్కొన్నారు. ప్రభుత్వం 40 శాతం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడాన్ని హర్షిస్తూ శనివారం సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు విద్యార్థుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్ బాక్స్

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు త్వరగా జారీ చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్మపురి మండల డిప్యూటీ తహసీల్దార్ సుమన్‌కు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వక్ష్యం చేయడం వల్ల రేషన్ కార్డులు జారీ చేయడంలో ఆలస్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ ధర్మపురి మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు పులి ప్రేమిత్, జిల్లపెల్లి భీమయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన పంచాయతీరాజ్ అధికారులు



జీవన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసంలో పంచాయతీరాజ్ శాఖలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బీర్‌పూర్ ఏఈ విశ్వంధర్ రావు, సారంగాపూర్ ఏఈ కళ్యాణ్, డీఈ మిలియన్ జీవన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డిని శనివారం ధర్మపురి మున్సిపల్ నూతన కమిషనర్ కె. శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇద్దరిని ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట ధర్మపురి మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ ఉన్నారు.

వసతి గృహ విద్యార్థులకు ఊరట



- డైట్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచిన ప్రభుత్వం
- సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అమలుకు నిర్ణయం
- జిల్లాలో సుమారు 15 వేల మందికి ప్రయోజనం



జగిత్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు విద్యార్థులకు ఊరటనిస్తోంది. చాలీచాలని చార్జీలతో వసతి గృహంలో కాలం నెట్టుకొస్తున్న విద్యార్థులకు ఎట్టకేలకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆయా చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో టీఎస్ఆర్ఈఐ సొసైటీ స్కూళ్లలో, మైనార్టీ వెల్ఫేర్, ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ఈఐ, టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఐ సొసైటీ స్కూళ్లలో సుమారు 13 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, రెండు పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో, ఎస్సీ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్‌లో, బీసీ వసతి గృహాలు పోస్టుమెట్రిక్, ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 2,000 మంది వసతి పొందుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

డైట్ చార్జీల పెంపు ఇలా....

3వ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులకు ప్రస్తుతం రూ. 950 ఉండగా.. రూ. 1,330కి, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1,100 ఉండగా రూ. 1540కి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ. 1,500 ఉండగా రూ. 2,100కు డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాస్మొటిక్ చార్జీలు 3వ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థినులకు రూ. 55 చెల్లిస్తుండగా రూ. 175కు, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 75 చెల్లిస్తుండగా రూ. 275కు పెంచారు. విద్యార్థులకు 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు రూ.62 నుంచి రూ. 150కి, 8వ తరగతి వరకు రూ. 62 నుంచి రూ. 200కు, కళాశాల విద్యార్థులకు రూ. 1,500 నుంచి రూ. 2,100 వరకు పెంచారు.

కాస్మొటిక్ చార్జీలు...

కాస్మొటిక్ చార్జీలు గతంలో రూ. 62 మాత్రమే చెల్లిస్తుండగా తరగతులను బట్టి రూ. 150 నుంచి రూ. 275కు పెంచారు. గతంలో చెల్లించే చార్జీల్లో విద్యార్థి హెయిర్ కటింగ్ కోసం రూ. 12 చెల్లించగా మిగితా డబ్బుతో సబ్బులు, నూనె తదితర కొనుగోలుకు రూ. 50 ఏమాత్రం సరిపోయేవి కావు. చిన్న పిల్లలకు హెయిర్ కటింగ్ కోసం రూ. 50 లేనిదే కత్తెర వేయని పరిస్థితి ఉందని నిర్వాహకులు వాపోతున్నారు. విద్యార్థినుల కాస్మెటిక్ చార్జీలు అంతంత మాత్రంగానే ఉండడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తరగతులను బట్టి రూ. 55 నుంచి 75 వరకు చెల్లిస్తూ వచ్చారు. ఇందులోనే న్యాప్ కీన్లతో పాటు అవసరమైన వాటిని కొనుగోలు చేయడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం 3వ తరగతి నుంచి 7వ తరగతికి రూ. 175, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ. 275 వరకు పెంచడంతో ఊరటనిస్తోంది.

మిగతా 8వ పేజీలో..

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

వీసీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్ధేశిత లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైద్రాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తాలు, తప్ప పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు జరపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. బ్యాంక్ గ్యారెంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకొని ధాన్యం కేటాయింపు చేయవచ్చన్నారు. 48 గంటల్లో ధాన్యం కొనుగోలు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అలరించిన రామకృష్ణ ఫ్రెషర్స్ డే వేడుకలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ విభాగంచే వెల్‌కం వేవ్-2కే24 పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక వాసవి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మెన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకొని, వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ రాజేందర్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమేష్, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

నేతకాని కులస్తులకు న్యాయం చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కుల గణన చేస్తున్న నేపథ్యంలో మాల సాలె నేథాని కులం పేరు తప్పుని తొలగించి ఎస్సీ నేతకాని కులం పేరును పొందుపరచాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్ నేత శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది జనాభా కలిగిన నేతకాని కులాన్ని రాష్ట ప్రభుత్వం చేపడుతున్నటువంటి కులగణన సర్వేలో ఎస్సీ నేతకానిని ఏ కేటగిరీలో కొనసాగించాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు రాగుల మల్లేష్, గోగు దేవేందర్, తలపల్లి సత్యనారాయణ, తలపల్లి లక్ష్మణ్, ముడిమడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురిలో కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం 7

- వైభవంగా గంగా హారతి



గంగా హారతి ఇస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసింది కాంగ్రెస్సే 8

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



తేమ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి 7

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బండి సంజయ్, మేడిపల్లి సత్యం

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న కుల సంఘాల నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చింతకుంటకు వెళ్లే దారిలో ప్రభుత్వ స్థలం, ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు షెడ్లు ఏర్పాటు చేసి కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన వివిధ కుల సంఘాల నాయకులు శనివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ స్థలంలో షెడ్లు ఏర్పాటు చేసి కబ్జా చేయడం వల్ల చింతకుంట మత్తడి నీరు, వర్షపు నీరు వెళ్లే దారి లేక ప్రజలు ఇబ్బంది పడతారని వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి అక్రమ కట్టడాలను అరికడదామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల రాము, పాల్గొన్నారు.

గంగుల కమలాకర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 22న మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి గంగుల లక్ష్మీనర్సమ్మ మృతి చెందగా శనివారం కరీంనగర్‌లో జరిగిన దశ దినకర్మ కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి రాజేశంగౌడ్ లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు వికాస్ గంగులను పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

- జగిత్యాల పట్టణానికి చెందిన సీనియ్ కాంగ్రెస్ నాయకుడు గౌరిశెట్టి చిరంజీవి సతీమణికి గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరుగగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం ఆమెను పరామర్శించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కూసరి అనిల్, కొలగాని సత్యం ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సారంగాపూర్, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) ఈ నెల3,4, 5 తేదీలలో కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ మైత్రి. అర్చనలు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో కిషోర్, ఉపాధ్యాయులు, సీనియర్ విద్యార్థులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని ఆకాక్షించారు.

సేవాదళ్ సమావేశాలు విజయవంతం చేయండి

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన అఖిల భారత సేవాదళ్ కాంగ్రెస్ వారోత్సవాలను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మారుతి పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో జరిగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సమావేశానికి సన్నాహకంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బాపూజీ జిల్లా అధ్యక్షుడు భూమాచారి, సింగారపు అశోక్, ఎండీ నాసర్, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ముందుండాలి

- తెలంగాణకు ప్రత్యామ్నాయం బీజేపీ
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలు



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ కార్యకర్తలు మరింతగా కష్టపడి సభ్యత్వ నమోదులో నిజామాబాద్ పార్లమెంట్‌ను రాష్ట్రంలో ముందుంచాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో క్రియాశీల సభ్యత్వ నమోదుపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ సభ్యత్వ నమోదు తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన అర్వింద్, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. గతంలో ఎవరూ లేని సమయంలోనే సభ్యత్వంలో నిజామాబాద్ పార్లమెంట్ రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిందని, ప్రస్తుతం కరీంనగర్ తొలి స్థానంలో నిలవగా, నిజామాబాద్ ద్వితీయ స్థానానికి పడిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని, ఎక్కడికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డిని తిడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీది నేచురల్ డెత్‌గా మారిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ శ్రేణులకు కుక్క కూడా ఓటు వేయదని, వాళ్ల పాదయాత్ర చేసిన, రాష్ట్రం అంతా పాకులాడిన ఫలితం శూన్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి ఆలోచన అవసరం లేదని, ప్రజలు ఇప్పటికే ప్రభుత్వ పనితీరుపై నిర్ణయం తీసుకున్నారన్నారు. బీజేపీ శ్రేణులు యాక్టివ్ అయ్యి, సభ్యత్వం పెంచితే 100 సీట్లు రావడం తథ్యమని, బీజేపీకి తెలంగాణలో అధికారం ఎంతో దూరంలో లేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి హామీలు ఇవ్వాలని, అబద్దపు హామీలు ఇవ్వద్దని కామెంట్స్ చేయడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రజలు గమనించారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై ఆయా శాఖలపై సీఎం కనీసం రివ్యూ నిర్వహించడం లేదన్నారు. కేసీఆర్ మొదలు పెట్టిన దుర్మార్గపు పాలనను, కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తుందని విమర్శించారు. బీసీ కమిషన్ పారదర్శకంగా పనిచేయాలని, కమిషన్‌కు బీజేపీ తరుపున సహకరిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నుంచే బీజేపీ తడాఖా చూపిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కేవలం బీజేపీ కనిపిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు, డాక్టర్ రఘు, సత్యం, రాగిల్ల సత్యనారాయణ, కన్నం అంజయ్య, బోగ శ్రావణితో పాటు బూత్ లెవల్ బాధ్యులు, పదాధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో నిండిన ప్రధాన ఆస్పత్రి ఆవరణ

ఇబ్బంది పడుతున్న రోగులు, ప్రజలు

జగిత్యాల అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య ఎంత ఉన్నా అంబులెన్స్ వస్తే ఎవరైనా పక్కకు జరిగి దారి ఇస్తారు. కానీ నిత్యం వందలాదిగా తరలివచ్చే రోగులతో నిండి ఉండే జగిత్యాల ఏరియా ఆస్పత్రికి ఒక అంబులెన్స్ వస్తే వెనుక వచ్చిన అంబులెన్స్ ఎంత అత్యవసర పరిస్థితి ఉన్నా లోపల ఉన్న అంబులెన్స్ బయటకు వచ్చేవరకు ఆగాల్సిందే. జగిత్యాల ప్రధాన ఆస్పత్రి ఆవరణ ఆక్రమణకు గురి కావడంతో ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణించే ప్రయాణీకులకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో వసతులు పెరుగడంతో రోగుల సంఖ్య కూడా పెరిగింది. ఆస్పత్రిలోకి వెళ్లే దారిలో కొంత మేర ఆస్పత్రికి వచ్చే వారు తమ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయగా పండ్ల వ్యాపారులు తమ బండ్లు పెట్టుకుని ఓవైపు ఆక్రమించుకున్నారు. మరోవైపు పదుల సంఖ్యలో అంబులెన్స్‌లు పార్క్ చేయడంతో ఆస్పత్రికి లోపలికి వెళ్లి రావడం గగనంగా మారింది. ఒక అంబులెన్స్ లోపల ఉంటే ఆ అంబులెన్స్ బయటకు వచ్చేదాకా మరో అంబులెన్స్ బయటకు లోపలికి వెళ్లే అవకాశం లేకపోవడం అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్‌లో వచ్చిన రోగులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.



ద్విచక్ర వాహనాలతో కిక్కిరిసిన ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మణిదీప్ ఎంపిక


మణిదీప్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి మణిదీప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జితేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి అండర్ 14 కరాటే పోటీలో మణిదీప్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడని తెలిపారు. అండర్-20 ఖోఖో పోటీల్లో కాశవేని దేవిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతోపాటు దాడి చేసి ఇబ్బందులకు గురిచేసిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గోదాంగడ్డకు చెం దిన రమేష్, ఒక యువతి సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఇటీవల రమేష్ ఆ యువతితో గొడవ పడి దాడి చేశాడు. యువతి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవా గుణం.. స్ఫూర్తిదాయకం

ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ స్ఫూర్తినిచ్చేవారు అరుదుగా కనిపిస్తారు. తమ ప్రాంతానికి సేవ చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చింతోజు భాస్కర్ మానేరు సంస్థల ద్వారా ఆ జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తమ ప్రాంతంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోటారు మెకానిక్ నుంచి సేవా రంగంలోకి..

- మానేరు సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతోజు భాస్కర్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన చింతోజు భాస్కర్‌ను పేదరికం చిన్ననాడే పనివైపు పరుగులు పెట్టించింది. సిరిసిల్లలో మోటారు మెకానిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న భాస్కర్ డీలర్‌గా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు.



అబ్దుల్ కలాం అవార్డును అందుకుంటున్న భాస్కర్


చింతోజు భాస్కర్

ఆర్థికంగా ఎదుగుతూ మరి కొందరికి ఉపాధి కల్పిస్తూనే స్వచ్ఛంద సేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవా కార్యాక్రమాలను విస్తరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ వంటి విపత్కర పరిస్థితుల్లో అన్నదానం, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సిరిసిల్లలో కార్మికుల వరుస ఆత్మహత్యల నివారణ కోసం మనోధైర్య శిబిరాలను నిర్వహించారు. పలు అవార్డులు, పురస్కారాలను పొందారు. లోక్ అదాలత్ సభ్యుడిగా, ప్రభుత్వ పరంగా పలు కమిటీల్లోనూ పని చేస్తున్నారు. సినీనటుడు సంపూర్ణేష్‌బాబుతో కలిసి కొబ్బరిమట్ట, బజారురౌడీ తదితర సినిమాల్లో నటించారు. పలు సినీ ప్రముఖులతో టీవీ షోల్లో పాల్గొన్నారు. న్యాయ సేవలను పొందడానికి ప్రజల్లో అవగాహనను పెంపొందించే దిశగా సినిమాను రూపొందిస్తున్నారు

పూర్వ విద్యార్థులు కలిసి.. ట్రస్ట్‌గా ఏర్పడి

- సేవలు అందిస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్

పెగడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ చేయాలనే గుణం ఉంటే లక్షాధికారులో, కోటీశ్వరులో కానక్కరలేదు.. మంచి మనసుండి చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు నంచర్ల శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. పెగడపల్లి మండలంలోని నంచర్ల కేంద్రంగా నంచర్ల, రాములపల్లి, దీకొండ గ్రామాలకు చెందిన నంచర్ల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 మంది కలిసి 2018లో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా తమ గ్రామాల్లో సేవలు అందజేసి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేశారు. ఆపద సమయంలో ఆస్పత్రికి వెళ్లేందుకు ఆరు లక్షలు వెచ్చించి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దాత ఒకరు వైకుంటరథం ఇస్తే ట్రస్ట్ తరుపున డ్రైవరు, డీజిల్ ఖర్చులు చెల్లిస్తున్నారు. మూడు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వార్తా పత్రికలతోపాటు యువతకు అవసరమయ్యే పుస్తకాల అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పలు సేవలు చేస్తున్నారు.


క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి రూ. 75 వేలు ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు

- చేపూరి మల్లేశగౌడ్, మేనేజింగ్ ట్రస్టీ



మాతృభూమికి కొంతైనా చేయాలన్న సంకల్పంతో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించాం. ట్రస్టు సభ్యులే కాకుండా దాతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకారంతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు గ్రామాలకే కాకుండా మండలం, చుట్టు పక్కల గ్రామాలకు కూడా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అందిస్తున్నాం.

దాతల సహకారంతో మరిన్ని సేవలకు కృషి

- లింగంపల్లి లచ్చయ్య, కోశాధికారి



నంచర్ల పాఠశాలలో చదువుకున్న మేము పాఠశాలకు, గ్రామానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ట్రస్ట్ ప్రారంభించాం. విద్యా, వైద్యం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మరిన్ని సేవలు అందించాలనే దిశగా ముందుకు సాగుతున్నాం.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాలో అక్టోబరు 28 నుంచి 30 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17లో 81 కేజీల విభాగంలో బి అభిలాష్ రజత పతకం, అండర్-14లో 23 కేజీల విభాగంలో ఎం లహరి రజత పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వెంకటపద్మాదేవి, పీడీ ఎల్ వెంకటరమణ, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అభినందించారు.

అంతర్‌జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


ఎంపికైన 'ఆదర్శ' విద్యార్థులు

గొల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఎస్‌జీఎఫ్ ఇంటర్నెట్ చెస్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న దేవి శ్రీహర్షిణి, ఎనిమిదవ తరగతి చదువుతున్న దేవి మహర్షి హశ్విత్ అనే ఇద్దరు విద్యార్థులు చెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో మెరిసి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు సొంత అక్కాతమ్ముడు కావడం విశేషం. అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అక్కాతమ్ముడిని ప్రిన్సిపాల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పీడీ రజిత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగులకు త్వరలో యోగా శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యో తి): జిల్లాలోని ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా యోగా శిక్షణను నూతన సంవత్సరం నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం జిల్లా యువజన, క్రీడాశాఖ, యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తనకు యోగా అంటే చాలా ఇష్టమన్నారు. అవకాశం ఉంటే క్రీడాకారిణి గా, కనీసం జట్టుకు మేనేజర్‌గానైనా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఉందన్నారు. పాఠ శాలలు, ఇళ్లలో పిల్లలు కేవలం ధ్యానానికే పరిమి తం కాకూడదని, యోగాతో ప్రతిభను సొంతం చేసుకోవాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు చూస్తే గర్వంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన దీపక్‌కు స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నవ్వడం కూడా యోగా లో ఒక భాగమని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో యోగా చేయడం వలన చాలామం ది ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారని అన్నారు. జిల్లా యోగా అసోసియేష న్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడు తూ జిల్లాలో యోగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వర్ణ పతక విజేత దీపక్‌ను, కోచ్ రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి సుధాకర్, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్ నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ రాంబాబు, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి జనార్దన్‌రెడ్డి, తహసిల్దార్ కాశీచరణ్‌గౌడ్, జిల్లా ఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్య క్షుడు హర్మిందర్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మం ది క్రీడాకారులు వివిధ వయ స్సు విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆహూతు లను ఆకట్టుకున్నా యి. అనంతరం విజేతలకు కలెక్టర్ జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.




యోగాసన పోటీలను తిలకిస్తున్న కలెక్టర్, అతిథులు, యోగాసనం వేస్తున్న కలెక్టర్ తల్లి ప్రవమయి ఆచార్య


యోగాసనాలు వేస్తున్న బాలికలు

- యోగాసనాలు వేసిన కలెక్టర్ తల్లి

కలెక్టర్ మాతృమూర్తి ప్రవమయి ఆచార్య యోగాపై ఉన్న మక్కువతో పోటీలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. అనంతరం తన కూతురు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంది. ఇది తమ జీవితంలో మరపురాని ఘట్టమని వారు వ్యాఖ్యానించారు.

మంచు కురిసే వేళలో..


పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద పొగ మంచు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా వ్యాపించింది. శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు దట్టమైన పొగ మంచు ఆవరించింది. పాదాచారులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఏమీ కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.

- పెద్దపల్లి/జగిత్యాల అర్బన్/వెల్గటూర్/ఎండప ల్లి/రుద్రంగి


జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో..


రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో..


జగిత్యాల పట్టణంలో

వివాహిత ఆత్మహత్య

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సమత(21)అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన సమత ముత్తారం మండలంలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సంతోష్‌ను రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. రెండేళ్లుగా సంతోష్ వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు మొదట కరీంనగర్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తన కూతురు మరణానికి అల్లుడు బిస్కుల సంతోష్ కారణమని మృతురాలి తల్లి చేద లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతురాలికి పది నెలల కొడుకు ఉన్నాడు.

మనస్తాపంతో యువకుడు..

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బియ్యని అజయ్(24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... అజయ్ ప్రేమించిన అమ్మాయికి వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అజయ్ తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వరద కాలువలో దూకి వృద్ధురాలు..

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్‌పల్లికి చెందిన సుంకరి బుచ్చమ్మ (80) అనే వృద్ధురాలు వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. బుచ్చమ్మ కొంతకాలంగా కడుపు నొప్పి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన బుచ్చమ్మ మళ్లీ తిరిగి రాలేదు. సమీపంలో ఉన్న పెగ్గెర్ల వరద కాలువలో శనివారం శవమై కనిపించింది. కడుపునొప్పి తీవ్రం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. మృతురాలి మేనల్లుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో గ్రామానికి చెందిన ఈసంపల్లి ఆశిష్ అనే యువకుడు గాయపడ్డాడు. ఆశిష్ తన స్నేహితులను కలిసేందుకు మండల కేంద్రానికి వెళ్తుండగా వడ్డెర కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో తలకు, వెన్నుపూస భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

ముస్తాఫనగర్‌లో ఇల్లు దగ్ధం

గంభీరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో శివంది రమేష్ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చుకున్న లక్షా 20 వేలు నగదు కాలిపోయింది. బట్టలు, పత్రాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీస్‌లు పరిశీలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వాహన తనిఖీల్లో శనివారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు రెడ్డిపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఆటోను తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న మోటం గణేశ్, నంబయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు 12 రూపాయలు చెల్లిస్తూ కొనుగోలు చేసున్నారని పోలీసులు చెప్పారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని సుల్తానాబాద్ పరిధిలో ఉన్న కోళ్ల ఫాంలో అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై తోట తిరుపతి చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన కలపను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సీసీఎస్ ఎస్‌ఐ రవీందర్ నాయుడు శనివారం తెలిపారు. మండలంలోని లింగంపేట గ్రామ శివారులోని పోలీస్ అమరవీరుల స్థూపం వెనుక భాగంలో టేకు కలపను డంపు చేసినట్లు సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎనిమిది టేకు దుంగలు లభ్యం అయ్యాయని, వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ పట్టుకున్న కలపను ఎల్లారెడ్డికి తరలించనున్నట్లు తెలిపారు. కలప విలువ దాదాపు ఆరు వేల వరకు ఉంటుందని వివరించారు.

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా దీపారాణి



కోరుట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణానికి చెందిన జిల్లా దీపారాణి చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్ శనివారం ప్రకటించినట్లు పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దీపారాణి మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమానికి, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్ట ణ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘ సభ్యులు వాసం భూమానందం, సంఘసభ్యులకు దీపారాణి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో సిరిసిల్ల జట్టు నిలిచింది. బాలుర విభాగంలో మొదటి స్థానం సిరిసిల్ల, ద్వితీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంఈవో శ్రీనివాస్, శ్రీనివాస్, హెచ్ఎం తిరుమల, వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రవికుమార్, అనిల్, సొల్లు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 15వ తేదీ లోగా దరఖాస్తులు కళాశాల తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ బుర్ర చంద్రశేఖర్‌గౌడ్‌కు సమర్పించాలని కోరారు.

బోధన్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ రైలు పునరుద్ధరణ

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి కరీంనగర్ మీదుగా సిర్‌పూర్ కాగజ్‌నగర్ వరకు ప్రత్యేక రైలును శుక్రవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గతంలో కరోనా సమయంలో రైలును నిలిపివేశారు. ప్రతి రోజు ఉదయం 4.15 గంటలకు బోధన్ నుంచి బయలుదేరి కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 7.55 గంటలకు చేరుకుంటుంది. సిర్‌పూర్ కాగజ్‌నగర్‌కు 11.55 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 2.35 గంటలకు చేరుకుంటుంది. బోధన్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 6.15 గంటలకు చేరుకుంటుంది.

రాజన్నను దర్శించుకున్న టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర స్టేట్ కమిషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (టీఎస్‌సీపీసీఆర్) చైర్మన్ శ్రీనివాస్‌రావు శనివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదాన్ని అందజేశారు.


టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు


వంకాయ తోటలో కలుపు తీస్తున్న మహిళలు


సాగులో ఉన్న దొండ తోట

కూరగాయల సాగులో అతివలు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు

కూరగాయల సాగులో మహిళలు రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. సేంద్రియ ఎరువులను తయారు చేసుకుంటూ పంటలకు వాడుతున్నారు. పండిన కూరగాయాలను వారే మార్కెట్‌కు తరలించి అమ్ముతున్నారు. దీంతో దళారుల బెడద తగ్గింది. లాభమైనా.. నష్టమైనా తామే భరిస్తున్నారు. సీజన్‌కు అనుగుణంగా డిమాండ్ ఉన్న కూరగాయలు సాగు చేస్తున్నారు.


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాలిఫ్లవర్

కోరుట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని సర్పరాజ్‌పూర్, ఎఖీన్‌పూర్, అయిలాపూర్, నాగులపేట, వెంకటాపూర్ గ్రామాల


క్యాబేజీ తోటకు నీరు అందిస్తున్న మహిళా రైతు

మహిళలు అధిక మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు పండిస్తూ స్థానిక పట్టణాలకు తీసుకెళ్లి తామే విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు, సీజన్‌కు అనుగుణంగా వీరు కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తారు. ప్రధానంగా కాలిఫ్లవర్, క్యాబేజీ, టమాట, తోటకూర, పాలకూర, చుక్కకూర, వంకాయ, దోస, గోరుచిక్కుడు తదితర పంటలను పండిస్తున్నారు. కూరగాయలను రసాయన ఎరువులతో కాకుండా తాము తయారు చేసుకున్న ఎరువులు వేసి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీరు పండించిన పంటలను కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల వంటి పట్టణాలకు తరలించి మార్కెట్లలో విక్రయిస్తుంటారు. ప్రభుత్వం సహకరిస్తే మరింత సాగు చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదు. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. పండించిన కూరగాయలను విక్రయించుకోవడానికి ఆయా పట్టణాల్లో తమకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు బాగున్నాయి..

- తోట లక్ష్మి, మహిళా రైతు, సర్పరాజ్‌పూర్



మాకున్న 10 గుంటల వ్యవసాయ భూమిలో క్యాలిఫ్లవర్, క్యాబేజీ, తోటకూర సాగు చేస్తున్నాము. చేతికొచ్చిన కూరగాయలను స్థానిక పట్టణాల్లో విక్రయిస్తున్నాము. ప్రజలు కూడా తాజా కూరగాయలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

తాజా కూరగాయలకు గిరాకీ ఉంది..

జవిడి ప్రమీల, మహిళా రైతు, (నాగులపేట)



తాజా కూరగాయలకు మార్కెట్‌లో గిరాకీ బాగుంది. మేము ఏ రోజు తెంపిన కూరగాయలను ఆ రోజు మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతాం. సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో ఆదరణ బాగుంది.


సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న మహిళా రైతు

● సేంద్రియ ఎరువుల తయారీ

గేదే, ఆవు, మేక పేడతోపాటు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. అవసరం ఉన్న సమయంలో ఎరువులు వాడతారు. అవసరం ఉన్న సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుంటారు. కూరగాయలతోపాటు తోటల గట్లపై చామంతి, బంతి పూలు సాగు చేస్తారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి

- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆపై ప్రజా సేవకులం
- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మల్యాల-కాచారం రహదారి పనులను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన బండి

మల్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి సాధ్యపడుతుందని ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తూ ఎన్నికల తరువాత ప్రజా సేవకులుగా అభివృద్ధికి ముందుకు వెళదామని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మల్యాల మండలం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు 11.7కిమీ మేర కేంద్ర ప్రభుత్వ సీఆర్ఐఎఫ్ నిధులు రూ.25కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు విస్తరణ పనులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం, కేంద్రం కలిసి చేసుకోవల్సిన అభివృద్ధి అని ప్రస్తుతం ఇది కొనసాగిద్దామన్నారు. గత ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా ప్రొటోకాల్ పాటించలేదని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించడమే కాకుండా పేరు ప్రఖ్యాతల కోసం అధికారులపై ఒత్తిడి చేసిందన్నారు. చాలారోజుల తరువాత మల్యాలలో పార్టీల మధ్య ప్రొటోకాల్ పాటించడం కనిపించిందని ఇది మంచి సంప్రదాయమని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఇక ముందు ఈ ఆనవాయితీని కొనసాగిద్దామన్నారు. కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణకు అందులోనూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి అత్యధికంగా సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేశారని సంజయ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని ప్రస్తుత రహదారి పనుల ప్రారంభ విషయంలో ఎమ్మెల్యే సహకారం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పరం సహకారం అవసరమని, గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, సుద్దాల దేవయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు


గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

● కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

రహదారి విస్తరణ పనుల కోసం వచ్చిన బండి సంజయ్, మేడిపల్లి సత్యంకు బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వేర్వేరు పార్టీలు అయినప్పటికీ పరస్పరం కలిసికట్టుగా మల్యాల క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభ స్థలం వరకు పాదయాత్రగా రాగ ఆయా పార్టీల శ్రేణులు, ప్రజలు పూలు చల్లుతూ తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం పెద్ద ఎత్తున రెండు పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంతోషం వ్యక్తం చేశారు. ఇక ముందు కూడా అలాగే ముందుకు వెళదామని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కూడా కార్యక్రమానికి వస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా హాజరుకాలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యకర్తలతో చాయ్ తాగుతూ..ముచ్చటిస్తూ

కేంద్ర మంత్రి బండి సంజయ్ రహదారి పనుల శిలాఫలకం ఆవిష్కరణ తరువాత తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలతో కొంత సేపు సరదాగా గడిపారు. అనంతరం కొండగట్టులో అల్పాహారం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి ముచ్చటిస్తూ టీ తాగారు. బండి సంజయ్‌ను కలవడానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరాగా ఆయన ముందుకు కదలలేని పరిస్థితి నెలకొన్నది. పోలీసులు వారందరినీ అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు చేశారు. దీంతో బీజేపీ నాయకులు కొందరు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడిని కలవనీయరా.. సమస్యలు చెప్పుకో నియ్యరా అంటూ మండిపడ్డారు.

● కాగా రహదారి పనుల ప్రారంభానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో నూకపల్లికి బదులు మల్యాల గ్రామంగా పేర్కొనడంతో నూకపల్లి వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరు మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


బంజేరులో కంపోస్ట్ షెడ్డుని పరిశీలిస్తున్న నేషనల్ టీం సభ్యులు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం లీడర్ ఎస్పీ సునీల్‌కుమార్, సభ్యులు స్నేహ నజీబ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు బంజేరులో ఉపాధిహామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం, నేషనల్ రూరల్ లైవ్ లీ వుడ్ కార్యక్రమానికి సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేస్తున్న పనుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

వీర్నపల్లి మండలం బంజేరులో గ్రామపంచాయతీ రికార్డుల మెయింటెనెన్స్, అభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శి రణధీర్ పనితీరు బాగుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఏపీడీ నర్సింహులు, సాంకేతిక సలహాదారులు అర్షద్ పాషా, ఎంపీడీవో రఘురాం, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ అనిత, గంగాధర్, ఐకేపీ డీపీఎం పద్మయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీలు శ్యామల, రాధ పంచాయతీ కార్యదర్శులు రణధీర్, తిరుపతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు అధికారిపై కుక్కదాడి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, కులగణన సర్వే విధుల్లో ఉన్న వార్డు అధికారిపై కుక్క దాడి చేసిన ఘటన శనివారం నాడు వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక రామ్ మందిర్ వీధిలోని ఓ ఇంటికి సర్వే కోసం వెళ్లిన మున్సిపల్ వార్డు అధికారి ఆంజనేయులుపై అక్కడున్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో కాలుకు గాయమైన ఆంజనేయులును ఏరియా ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య శనివారం తెలిపారు. వీర్నపల్లి మండలం జవహర్ లాల్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా తరుణ్ అనే యువకుడు వరికోత మిషన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా సాగర్‌తో పలు విషయాల్లో గతం నుంచి తరుణ్‌కు విభేదాలు ఉన్నాయి. దానిని దృష్టిలో ఉంచుకొని సాగర్ అతడి స్నేహితులు దేవేందర్, రవి, శ్రీహరి వరికోత మిషన్ నడుపుతున్న తరుణ్‌ను మిషన్‌పై నుంచి దించి తీవ్రంగా గాయపర్చారు. గాయపడిన తరుణ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు నట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య తెలిపారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం


నదిలో దీపాలు వదులుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గోదావరి నది వద్ద గంగా హారతి

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా నిర్వహించే విధంగా ధర్మపురి గోదావరి నది వద్ద సాయంత్రం గంగా హారతి ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి 15 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు సిబ్బంది ఊరేగింపుగా గోదావరి నదికి వెళ్లారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు పౌర్ణమి వరకు నిత్యం సాయంత్రం వేళలో నిర్వహిస్తారు. గంగా హారతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి పాల్గొన్నారు.

● భక్తుల రద్దీ..

ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు అంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో కార్తీక దీపారాధన

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకొని దీపారాధన నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అభిషేక మండపంలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యకారుడు నీలకంఠం స్వామి వారి భజన చేశారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు

● వేములవాడలో ఆకట్టుకున్న కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): ఆదిదంపతులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంను పురష్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో వెలిగించిన కార్తీకదీపోత్సవం నేత్రపర్వంగా ఆకట్టుకుంది. కార్తీకమాసం మొదటి రోజు కావడంతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన భక్తులు ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీపాలను వెలిగించారు. ఓం, ఓం నమఃశివాయ, స్వస్తిక్ రూపాల్లో భక్తులు వెలిగించిన దీపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచే భక్తులు రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో రాజన్న ఆలయ ప్రాంగాణం దీపాలకాంతుల్లో దేదిప్యమానంగా వెలుగొందింది.


కొండగట్టులో..

● ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అర్చకులు వేదమంత్రాలతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గండదీపంలో ఆకాశదీపాన్ని ఆలయ అర్చకులు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, ఆలయ అర్చకులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

మల్లాపూర్ డీటీగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ

మల్లాపూర్, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలోని డీటీగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సివిల్ సప్లైయి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను ఉన్నత అధికారులు మల్లాపూర్ డీటీగా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శనివారం మల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా సిబ్బంది స్వాగతం పలికి శుభకాంక్షలు తెలిపారు.

వంట మనిషికి దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట పని చేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లూరి సంతోష్ తెలిపారు. ఆసక్తి గలవారు నవంబరు 5లోగా దరఖాస్తులను సమర్పించాలని అన్నారు.

అపెరల్ పార్కు గోదాముల్లో ధాన్యం నిల్వకు చర్యలు



గోదాములను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అపెరల్ పార్కు గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం నిల్వ చేసేందుకు అనుకూలంగా ఉన్న అపెరల్ పార్క్ గోదాములను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యాన్ని భద్రపర్చేందుకు ఇంటర్మీడియెట్ గోదాములను పరిశీలించామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అపెరల్ పార్కు గోదాములలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి నిలువ చేసే సామర్థ్యం ఉన్నట్లు పేర్కొన్నారు.

దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసింది కాంగ్రెస్సే

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గతంలో రైతులు తాము పండించిన ధాన్యం విక్రయించుకోడానికి అనేక కష్టాలు పడ్డారని దళారీ వ్యవస్థను రూపుమాపింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని భూషణరావుపేట, సిరికొండ ప్యాక్స్, కథలాపూర్, సిరికొండ గ్రామాల్లో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మహిళలను వ్యాపారాల్లో భాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహణా బాధ్యతలు అప్పగించి సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రు. 2 లక్షలు రుణమాఫీ చేశారని అన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నిలిచిపోయిందని కొద్ది రోజుల్లోనే వారి ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపారు. రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. సిరికొండకు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని రైతులకు అంతరాయాల నుంచి కొద్ది రోజుల్లో విముక్తి లభించనుందని పేర్కొన్నారు. సూరమ్మ కుడి, ఎడమ కాలువల పనులు, కథలాపూర్‌లో ఏర్పాటు చేయనున్న 220/133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల ప్రారంభానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆహ్వానించనున్నామని చెప్పారు. రైతాంగం కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యం విక్రయించుకోవాలని కోరారు. భూషణ రావుపేట రైతులు కాండ్ల బాట మరమ్మతులకు నిధులు మంజూరే చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ బత్తుల నరేశ్, సీఈవో రాం ప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, రాష్ట్ర ఫిషర్‌మెన్ విభాగం కార్యదర్శి గంగాధర్, చేనేత విభాగం కార్యదర్శి హరి ప్రసాద్, లింగం గౌడ్, శ్రీహరి, సింగిల్‌విండో డైరెక్టర్లు, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, ఏవో యోగిత ఉన్నారు.

లోలెవల్ కల్వర్టులు..

హైలెవల్‌గా మారేదెప్పుడో..?

● ప్రమాదపుటంచున ప్రయాణం

● నెరవేరని నేతల హామీలు

కథలాపూర్, నవంబరు 2 : ఎప్పుడో ఐదు దశాబ్దాల కిందట నిర్మించిన లోలెవల్ కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రయాణీకులకు ప్రమాదకరంగా పరిణమించాయి. ఏటేటా అడవుల నుంచి వచ్చే నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కల్వర్టులు కొట్టుకుపోతు న్నాయి. అప్పుడు వాగులపై చిన్నగా నిర్మించగా ప్రస్తుతం వాగులు నీటి ప్రవాహానికి కోసుకుపోవడం వల్ల కల్వర్టులు అధ్వానస్థితికి చేరుకున్నాయి.

● వానాకాలంలో రాకపోకలు బంద్

ఏళ్ళ కిందట నిర్మించిన లోలెవెల్ కల్వర్టులు నీటి ఉధృతికి దెబ్బతినగా మరమ్మతులు చేసే నాథుడే కరవయ్యాడు. మండలంలోని ఇప్పపల్లి-పోతారం మధ్య ఉన్న కల్వర్టుపై నీరు ప్రవహిస్తే రాకపోకలు వానకాలంలో ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. పోతారం నుంచి లొంకరామన్న తండా మధ్యలో ఉన్న కల్వర్టు ఏటా ధ్వంసం అవుతున్న కారణంగా తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టాల్సి వస్తోంది. భారీ వర్షాల సమయంలో రోజుల తరబడి గిరిజనులకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. తాండ్ర్యాల-గంభీర్‌పూర్ గ్రామాల మధ్య ప్రవహించే పెద్దవాగు విపరీతమైన ఉధృతితో వస్తూ తరచూ కోతకు గురవుతోంది. గత ఏడాది గంభీర్‌పూర్ కొచ్చెరువు తెగిన సమయంలో భారీ వరద వచ్చి సగం కొట్టుకుపోయింది. దీంతో కొద్ది రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ కల్వర్టు ప్రమాదకర పరిస్థితి ఉంది. అంబారిపేట-తుర్తి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కల్వర్టు వద్ద చిన్నపాటి వర్షాలకే రవాణా నిలిచిపోతుంది.

జనాలు లోలెవల్ కల్వర్టుతో ఇబ్బందులు పడుతుండగా ఎన్నికల సమయంలో నాయకులు ఇస్తున్న హామీలు మాత్రం నీటి మూటలు గానే మిగిలి పోతున్నాయి. లోలెవల్ కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా మార్చితేనే మారుమూల పల్లె వాసుల ఇక్కట్లు తీరుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.





గంభీర్‌పూర్-తాండ్ర్యాల మధ్య ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు..అధ్వానంగా పోతారం గిరిజన తండాకు వెళ్లేదారి

వసతి గృహ విద్యార్థులకు ఊరట

5వ పేజీ తరువాయి..

రాష్ట్రంలో సుమారు 2017లో చివరి సారి డైట్ చార్జీలు, 2008 సంవత్సరానికి ముందు వ్యక్తిగత పరిశుభ్రత (కాస్మోటిక్ చార్జీలు) పెంచారు. ప్రస్తుతం ఈ రెండింటినీ ఒకేసారి పెంచడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూర నుంది. పెరిగిన చార్జీలు ఈనెల నుంచి అమలులోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు. గతంలో అరకొరగా కాస్మొటిక్, డైట్ చార్జీలు ఇస్తుండడం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుండేది. ఈ నేపథ్యంలో 16 ఏళ్ల కిందట నుంచి ఉన్న చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊరట చెందుతున్నారు. చార్జీల పెంపు వల్ల జిల్లాలో సుమారు నెలకు రూ. అర కోటి వరకు ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది.

సకాలంలో విడుదల చేస్తేనే..

దొనికెల నవీన్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



ప్రభుత్వం వసతి గృహ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం సరే.. కానీ వీటిని సకాలంలో విడుదల చేస్తేనే విద్యార్థులకు ప్రయోజనం ఉంటుంది. ఇప్ప టివరకు నెలల తరబడి చార్జీలు విడుదల కాకపోవడంతో అటు వసతి గృహ అధికారులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా సంబంధిత చార్జీలను సకాలంలో విడుదల చే యాల్సిన అవసరముంది.

సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల



ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం లభించే అవకాశం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ప్రత్యేక కృతజ్ఞతలు. సుమారు దశాబ్దన్నర కాలం నుంచి వసతి గృహాల విద్యార్థులు ఎదుర్కొంటున్న కాస్మొటిక్, డైట్ చార్జీల సమస్యలను అధిగమనించే అవకాశాలున్నాయి.

బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరమర్శిస్తున్న ఎంపీ అర్వింద్

మెట్‌పల్లిటౌన్, నవంబర్2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తల కుటుంబాలను శనివారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పరామర్శించారు. పట్టణానికి చెందిన బీజేపీ కౌన్సిలర్ మర్రి పోచయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను, సుంకెట విజయ్, గడ్డం మల్లేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదర్చారు. చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, డాక్టర్ రఘు, బొడ్ల రమేష్, చెట్లపల్లి సఖేందర్‌గౌడ్, దొనికెల నవీన్, యాదగిరి బాబు, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.



పోరుమల్ల ప్యాక్స్ గోదామును తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

ఎరువులను అందుబాటులో ఉంచాలి

మేడిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ డీలర్లు, ప్యాక్స్ కేంద్రాలు కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి రాంచందర్ అదేశించారు. శనివారం మేడిపల్లి మండలంలోని కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లోని పాక్స్ ఎరువుల గోదాములను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు స్టాకు రిజిష్టరులో నమోదు చేసి ఈ పాస్‌లో తొలగించాలని అన్నారు. అక్రమ నిల్వలను కల్గిఉండి రైతులను ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. నిబంధలను అతిక్రమించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయన వెంట మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ షాహిద్ అలీ, సీఈవోలు తిరుపతి, బొందయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

పీఎస్‌సీఎస్ చైర్మన్ కేసిరెడ్డి నవీన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కేసిరెడ్డి నవీన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మెట్లచిట్టాపూర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగ్గసాగర్, కొండ్రికర్ల, కోనరావుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాలు లేకుండా సరైన తేమ శాతం ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సొసైటీ ద్వార ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పీఎస్‌సీఎస్ సీఈవో తిరుపతి, నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండె రమేష్, మారు జనార్ధన్‌రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్, గంగనర్సయ్య, మారుతి, రైతులు, పాల్గొన్నారు.



కొండ్రికర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఎస్‌సీఎస్ చైర్మన్

అనారోగ్యంతో ధర్మపురి ఆలయ మాజీ చైర్మన్ మృతి



సూర్యారావు (ఫైల్)

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్, సినియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి సూర్యారావు (80) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలం నుంచి సూర్యారావు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య భారతి, నలుగురు కూతుళ్లున్నారు. పెద్ద కూతురు జువ్వాడి శ్రీదేవి హైకోర్టు జడ్జిగా పని చేస్తున్నారు. సూర్యారావు అంత్యక్రియలు తిమ్మాపూర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించనున్నారు. సూర్యారావు మృతిపై ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ప్రజా ప్రతినిధులు, సంతాపం ప్రకటించారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

రాయికల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన మంత్రి రాజ్ కుమార్ కొడుకు మంత్రి హనీశ్విత్ (7)కు నిమ్స్‌లో శస్త్ర చికిత్స నిమిత్తం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం రూ.లక్షా 35 వేల ఎల్‌వోసీని వారి కుటుంబసభ్యులకు అందజేశారు. హనీశ్విత్ గుండెలో హోల్ సమస్యతో బాధ పడుతుండగా పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే ఎల్‌వోసీని అందజేశారు.

జగిత్యాల అర్బన్: జగిత్యాల పట్టణం టీఆర్ నగర్ 47వ వార్డుకు చెందిన చిట్యాల మురళికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం ఎల్‌వోసీ అందజేశారు. మురళి తుంటి ఎముక సంబంధిత సమస్యతో బాధ పడుతున్నాడు. స్థానిక కౌన్సిలర్ చాంద్ పాషా ద్వారా వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ ద్వారా నిమ్స్‌లో శస్త్ర చికిత్స నిమిత్తం రూ.లక్ష ఎల్‌వోసీని మురళికి అందజేశారు.

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన బి. రాజమణి అనే మహిళకు హైదరాబాద్‌లో అత్యవసర చికిత్స అవసరం కాగా వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ రు. 1,50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం తెలిపారు. మహిళకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించినట్టు చెప్పారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మేంగు రాజేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ అసుపత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ. 3,20,000 లక్షల ఎల్ వోసీని హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. అండగా నిలిచిన లక్ష్మణ్ కుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్ర జ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువును పొడిగించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, వేములవాడ మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ కోరారు. కరీం నగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నదని, ఇప్పటి వరకు చాలా తక్కువ సంఖ్యలో పట్టభద్రులు మాత్రమే ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఒక ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రఘువరణ్

జగిత్యాలరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రఘువరణ్ ప్రారంభించారు.

జిల్లాలో 136 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఆయా గ్రామాల్లో గ్రామ మహిళస మాఖ్యల ద్వారా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంవత్సరం ఐరిస్ పద్దతిలో చెల్లింపు వివరాలు నమోదు చేస్తామన్నారు.

●జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రా మంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లెడ ప్యాక్స్ చైర్మన్ సందీప్‌రావు ప్రారంభించారు. అలాగే అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీవో రవిబాబు, ఏపీ ఎం గంగాధర్, సివిల్ సప్లై అధికారి వర ప్రసాద్ ప్రారంభించారు. ఈకార్య క్రమంలో సీసీలు గంగారాం, శ్రీనివాస్ ఏ ఈవో లు రవళి, రమ్య, మాజీ సర్పంచ్ మ హే శ్వర్‌రావు, జలందర్, మాజీ ఎంపీటీసీ పరశురాంగౌడ్, పంచాయతీ సెక్రటరీలు రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుంటే పాదయాత్ర చేస్తాం

కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే సంజయ్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12లోపు రుణమాఫీ, రైతుబంధు ఇవ్వాకుంటే రైతుల పక్షన బీఆర్ఎస్ పార్టీ పాదయాత్ర చేస్తామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మం డల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగో లు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు కోతలు లేకుండా ధాన్యం కోనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. ఈ నెల 12 లోపు రైతులకు రుణమాఫీ, రైతుబంధు డబ్బులు ఇవ్వ కుంటే రాష్ట్రంలో పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు రైతు వేదికలో మండలానికి చెందిన పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, సీఎం అర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బద్దం గోపి, బీఆర్ఎస్ నా యకులు ఎలాలా దశరథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ ఏది..?

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు



కుబ్‌సింగ్ పార్క్ వద్ద తాళం ఉన్న ప్రజా మరుగు దొడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బహిరంగ మల మూత్ర విసర్జన చేయ కండి..మరుగు దొడ్లను వాడండి.. అని నీతి మాటలు చెప్పే అధికారులు ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహ రిస్తున్నారు. ప్రజల కోసం ఎర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. దింతో ఆయా కార్యలయలకు, పట్టణాలకు వచ్చే ప్రజలకు కనీసం మూత్ర విసర్జనకు కూడ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి మెట్‌పల్లి పట్టణంలో నెలకొంది. పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యర్థం మున్సిపల్ పరిధిలో కుబుసింగ్ పార్క్ వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద, డిపో వద్ద, మున్సిపల్ కార్యలయం వద్ద ప్రత్యేకంగా ప్రజా మరుగుదొడ్లను లక్షలు వెచ్చించి నిర్మించి లక్షణంగా వదిలేశారు. మున్సిపల్ అధికారులు వాటి నిర్వహణ పట్టించుకోకపోగా సిబ్బంది వాటికి తాళలు వేసి మరి నిరుపయోగంగా మార్చారు. వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు అమ్మేందుకు మహిళలు ఉదయం వచ్చి సాయంత్రం అమ్ముడు పోయే వరకు ఉండాల్సి వ స్తుంది కాని ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో మహిళలు మూత్ర విసర్జన కూడ వసతి లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిర్వహణ భారంగా మారింది

మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ భారంగా మారింది. దింతో ప్రవైట్ వ్యక్తులకు పే అండ్ యూజ్ కొరకు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నాం. గతంలో ఓ మారు నోటిఫికేషన్ ఇచ్చాం కాని నిర్వహణకు ఎవరు రాలేదు. దింతో ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మల్లాపూర్, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 41 మందికి సీఎంఆర్ఎస్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట శ్రీనివాస్, సందిరెడ్డి శ్రీని వాస్ రెడ్డి, కాటిపెల్లి సరోజన, ఆదిరెడ్డి, శ్రీని వాస్, గోవింద్‌నాయక్, నాగరాజు, బిట్ల నరేష్, శ్రీనివాస్, నగేష్, సత్తెమ్మ, పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కొడిమ్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్తురావుపేట గ్రామంలో శనివారం పశువైద్యాధికారి, సిబ్బంది గేదెలకు, ఆవులకు గాలికుంటు వ్యాది నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు కృష్ణారావు, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, జగిత్యాల వి జయ పాలడైరీ చైర్మన్ మల్లేశం, పశు వైద్యాధికారులు కమలాకర్, రాకేష్, సిబ్బంది ఇసాక్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

ఇబ్రహీంపట్నం, నవంబర్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోదుర్ గ్రామానికి చెందిన ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి తల్లి ఇటీవల మృతి చెందగా శనివారం రాష్ట్ర కాంగ్రెస్ సినియర్ నాయకు లు జువ్వాడి కృష్ణరావు వెంకటస్వామిని, కు టుంబ సభ్యులను పరమర్శించారు. కోమటి కొండపూర్ గ్రామానికి చెందిన వంగ నారయణ సతీమణి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరమర్శించారు.

పరిశోధనలతోనే శాస్త్రవేత్తలుగా ఎదుగుతారు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 2 : విద్యార్థులు పరిశోధనలతోనే శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని జిల్లా పశువైద్య కళావాల అసోసియేట్ జన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని శనివారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ పొ లాన కళాశాల విద్యార్థులు రైతులను కలిసి శిబిరంలో పంటల సాగులో అవలంబిస్తున్న వారి అనుభవలను తెలుసుకున్నారు.